యూజీడీ.. లీకేజీ



సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా యూజీడీ మ్యాన్‌హోల్ నుంచి రోడ్డెక్కిన మురుగు నీరు(ఫైల్)

- రోడ్డెక్కి ప్రవహిస్తున్న మురుగు నీరు
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహన చోదకులు
- మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో యూజీడీ మ్యాన్‌హోళ్ల లీకేజీతో రోడ్డుపైకి మురుగు నీరు చేరుతోంది. రహదారులపై మురుగు నీరు పారడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మ్యాన్‌హోళ్ల వద్ద రోడ్డెక్కి మురుగు ప్రవహిస్తున్నా.. పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ వార్డుల్లో ప్రతి రోజు ఎక్కడో ఒక చోట మ్యాన్‌హోళ్లు లీకవుతూనే ఉన్నాయి.

ముఖ్యంగా బాలయ్యశాస్త్రి లేఅవుట్, నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతం, సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ ప్రాంతంలోని రహదారుల్లో ఎక్కువగా మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు నీరు లీకవుతోంది. తాజాగా శనివారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయం ఎదురుగా రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి మురుగు నీరు బయటకు ప్రవహించింది. ఆ మార్గంలో రాకపోకలు సాగించిన వారు ఇబ్బంది పడ్డారు. మురుగు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చిందని పాదచారులు వాపోయారు. యూజీడీ మ్యాన్‌హోల్ లీకేజీ సమస్యతో పరిసరాలు దుర్గంధ భరితంగా మారుతున్నాయని, వర్షా కాలం కావడంతో జ్వరాలు విజృంభించే అవకాశముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి మ్యాన్‌హోళ్లు లీకవకుండా, రహదారులు మురుగుమయం కాకుండా తగు చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో అభయాంజనేయ స్వామి ఆలయం దరి రోడ్డుపై లీకవుతున్న మ్యాన్‌హోల్



నార్త్ ఎక్స్‌టెన్షన్ రోడ్డులో మ్యాన్‌హోల్ దుస్థితి

రూ.2 లక్షలతో సెల్లార్ నిర్మాణం



దుర్గాగణపతి ఆలయంలో సెల్లార్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 25వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేట దుర్గాగణపతి ఆలయంలో సెల్లార్ నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజు భూమిపూజ చేసి ప్రారంభించారు. ముందుగా దుర్గాగణపతిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.2 లక్షలతో సెల్లార్‌లోని స్టోర్ రూం పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నమ్మి రవి కుమార్, జనసేన వార్డు అధ్యక్షుడు సూర్యప్రకాష్, బీజేపీ వార్డు అధ్యక్షులు ఉమాశంకర్, బీజేపీ సీనియర్ నాయకులు నరాల బాలకృష్ణ, ఇ.శ్రీనివాసరావు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

43వ వార్డులో కార్పొరేటర్ పర్యటన



దాడి రామ్మూర్తి కల్యాణ మండపంపై అదనపు అంతస్తు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ



వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఉషశ్రీ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 43వ వార్డులో శనివారం కార్పొరేటర్ పి.ఉషశ్రీ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీనివాసనగర్‌లోని దాడి రామ్మూర్తి కల్యాణ మండపంపైన నిర్మిస్తున్న అదనపు అంతస్తు పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌కు ఆమె సూచించారు. వెంకటేశ్వరకాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం మహా అన్నదానం నిర్వహించారు. భక్తులకు కార్పొరేటర్ ఉషశ్రీ అన్నప్రసాదం వడ్డించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణలో భక్తులు, అర్చకుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతుల సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



ఏఈవో నరసింగరావుకు చెక్కు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరానికి చెందిన బి.శ్రీనివాసరెడ్డి దాత రూ.లక్ష 1116, మాధవధారకు చెందిన కె.అన్నయ్య అనే దాత లక్ష 16 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై అన్నప్రసాద భవనంలో ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు సంబంధిత చెక్కులు అందజేశారు. దేవస్థానం తరపున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు.

నేడు 'ఉక్కు విలీన దీక్ష'

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కు విలీన దీక్ష చేయనున్నారు. ఉక్కు రంగాన్ని వ్యూహాత్మక రంగంలో ఉంచడానికి, సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ పునఃవిలీనానికి, పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి చేయడానికి తక్షణ బెయిలౌట్ ప్యాకేజీకి ఉక్కు అధికారుల సంఘం అభ్యర్థిస్తోంది. సీ భవన్ వద్ద ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు దీక్ష నిర్వహించనున్నారు. ఉద్యోగులందరూ దీక్షలో పాల్గోవాలని నిర్వాహకులు కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన చిరు వ్యాపారులు



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చిరు వ్యాపారులు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును 24వ వార్డు నక్కవానిపాలేనికి చెందిన చిరు వ్యాపారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు ఎవరైనా పెడితే తక్షణమే తన వద్దకు రావాలని వారికి ఎమ్మెల్యే సూచించారు. తాతాజీ, నాయుడు, శ్రీను, శంకర్, రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణుకుమార్‌రాజుకు అభినందన

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన పెనుమత్స విష్ణుకుమార్‌రాజును మిజోరం గవర్నర్ కె.హరిబాబు అభినందించారు. దసపల్లా హిల్స్‌లోని గవర్నర్ నివాసంలో శనివారం విష్ణుకుమార్‌రాజును ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పరశురాం రాజు, సుహాసిని ఆనంద్ పాల్గొన్నారు.

21న గురుపౌర్ణమి వేడుకలు



గురుపౌర్ణమి వేడుకల కరపత్రికను ఆవిష్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ సభ్యులు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు. ధ్యాన మందిరంలో శనివారం వేడుకల కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ 21వ తేదీ ఉదయం నుంచి అభిషేకాలు, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అర్ధ ఏకాహం జరుగుతాయన్నారు. మధ్యాహ్నం మహా అన్నప్రసాదం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, ఆడిటర్స్ కె.నారాయణ, భుకారి మహ్మద్, ధ్యాన మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రధాన అర్చకుడు, షిర్డీసాయి సేవా సంఘం ప్రతినిధులు

20 నుంచి బాబా ఉత్సవాలు

అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద షిర్డీసాయి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు లక్ష్మీ సత్యనారాయణ ప్రసాద్, ప్రధాన అర్చకుడు హరి గోపాలశర్మ తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం మీడియా సమావేశంలో వీరు మాట్లాడారు. ఈ నెల 20న బాబా పల్లకీ సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 21వ తేదీ ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక సుదర్శన హోమం, అన్నాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సెక్రటరీ రేవతీరావు, ట్రెజరర్ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జీవో 596ను సవరించాలి

సీతమ్మధార: అసైన్డ్ భూముల క్రయ విక్రయాలు ఎస్సీల నుంచి ఎస్సీలకు, బీసీల నుంచి బీసీలకు మధ్యే జరిగేలా షరతులతో జీవో నంబర్ 596లో సవరణ చేయాలని ప్రభుత్వానికి విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమితి సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు సూచించారు. తద్వారా జీవో 596 ప్రకారం ఫ్రీ హోల్డ్ చేసిన అసైన్డ్ భూముల కొనుగోలులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. అసైన్డ్ భూముల కొనుగోలులో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగిన నేపథ్యంలో శనివారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల భూములు ఆదివాసీలకే అమ్మాలనే షరతు ఉన్నట్లే.. దళితుల అసైన్డ్ భూములు వారికి తప్ప ఇతరుల కొనుగోలు చేయడానికి అవకాశం లేకుండా జీవో సవరణ తేవాలన్నారు. నష్టపోయిన దళితులను ఆదుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి చంద్రబాబు, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామిలపై ఉందన్నారు. కార్యక్రమంలో సోడాదాసి సుధాకర్, ఈతలపాక సుజాత, జాజి ఓంకార్, బల్ల కుమార్, బూల భాస్కరరావు, గుడివాడ ప్రసాద్, డి.నిర్మల, రవిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బూసి వెంకటరావు

నేడు జిల్లా యాదవ సంఘం ఆత్మీయ సమావేశం

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల యాదవ సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం సిరిపురం వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించనున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణ యాదవ్ హాజరుకానున్నారన్నారు. ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లను సత్కరించనున్నామన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ నర్సు రామారావు యాదవ్, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పిలి అప్పలకొండ, ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, నమ్మి వెంకట్, మొల్లి లక్ష్మణరావు, కార్యదర్శి డొక్కర శ్రీను, సారిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు

ట్రెజరీలో ప్రక్షాళన

- అంతర్గత బదిలీలు
- ఏటీవో,ఎస్‌టీవో, సీనియర్ అకౌంటెంట్లకు స్థానచలనం

మహారాణిపేట: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. వరుస వివాదాలకు కారణమవుతున్న వారిని బదిలీ చేశారు. ఏటీవో, ఎస్‌టీవో, సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అకౌంటెంట్లను ట్రెజరీలో మరో విభాగానికి బదిలీ చేశారు. డబ్బులు ఇస్తే గానీ బిల్లులు చేయడం లేదని పలుశాఖల అధికారులు నేరుగా ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. మోహన్‌రావు కూడా ఇటీవల ట్రెజరీ కార్యాలయంలో విచారణ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ బిల్లులు చేస్తున్న ట్రెజరీ ఉద్యోగుల మీద ఆరోపణలు వెల్లువగా వచ్చాయి. ఇప్పుడు ఆ విభాగానికి చెందిన అసిస్టెంటు ట్రెజరీ అధికారి (ఏటీవో) సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో), ఇద్దరు సీనియర్ అకౌంట్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ జిల్లా ట్రెజరీ అధికారి యార్లగడ్డ సుధాకరరావు ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ బిల్లులు చూసే అసిస్టెంట్ ట్రెజరీ అధికారి నాగార్జునను పోలీసు శాఖకు బదిలీ చేసి, పోలీసు శాఖలో బిల్లులు చూసే నితిన్ జోషిని మెడికల్ బిల్లులకు నియమించారు. గతంలో ఉండే ఇద్దరు సీనియర్ అకౌంటెంట్లను కూడా బదిలీ చేశారు.

నేడు జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి ఆహ్వానం

మురళీనగర్ : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో నాల్గవ జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయని వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ పోటీలకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట లలితప్రియ పర్యవేక్షణలో ఈ పోటీలు నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. అండర్-11, 14, 17, 17 ఏళ్లు దాటిన వారికి నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు. వివరాలకు 95059 50425 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉద్యోగం, కుటుంబం రెండూ ముఖ్యమే..

- కష్టపడిన సిబ్బందికి గుర్తింపు
- సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించిన వారితో పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి, జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం: పోలీస్ సిబ్బందికి ఉద్యోగం ఎంత ముఖ్యమో.. కుటుంబం కూడా అంతే ముఖ్యమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. కమిషనరేట్ పరిధిలో పదోన్నతులు పొందిన 17 సివిల్, ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను శనివారం కమిషనరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు కుటుంబాన్ని కూడా చూసుకోవాలన్నారు. కానిస్టేబుల్‌కు తన ఉద్యోగ జీవితంలో పదోన్నతి రావడం చాలా అరుదన్నారు. ఐపీఎస్‌లకు ప్రతి మూడేళ్లకు ఓసారి పదోన్నతి రావడం సహజమన్నారు. అదే సంతోషాన్ని కానిస్టేబుళ్లలో ఉండాలని భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పదోన్నతి చెందిన కానిస్టేబుళ్లను వారి కుటుంబ సభ్యుల మధ్య సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తన జీవితంలో ఇటువంటి కార్యక్రమానికి ఎప్పుడూ హాజరుకాలేదన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన వారికి సీపీ, జేసీపీ కె.ఫకీరప్ప, ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా..

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా పోలీస్ సిబ్బంది, నగర ప్రజలు, మీడియా కలసికట్టుగా పని చేయాలని సీపీ పిలుపునిచ్చారు. గంజాయి అమ్మేవారిని, సేవించే వారిని నగరం వదిలివెళ్లేలా చేద్దామన్నారు. ఇందు కోసం ఇప్పటికే నగరంలో అవసరమైన చోట సీసీ కెమెరాలు, చీకటి ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తన ఫోన్ నంబర్‌ను పబ్లిక్‌కు ఇచ్చానని, గంజాయి తాగిన వారు, అమ్మిన వారి సమాచారం వాటాస్ప్/ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టెట్‌కు బ్రాహ్మణులకు ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: టెట్‌కు హాజరయ్యే బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వైజాగ్ బ్రాహ్మణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్ కుమార్ తెలిపారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులు పదో తరగతి, బీఈడీ, డీఈడీ, ఆధార్, జెరాక్స్ కాపీలను సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 99625 99790 / 92466 25822 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం



షేక్ మహమ్మద్ సర్ఫరాజ్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా. కంచరపాలెం తుమ్మడిపాలెంలో భార్యతో కలిసి నివసిస్తున్న షేక్ మహమ్మద్ సర్ఫరాజ్ ఈ నెల 10న ఇంట్లో నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఇతడికి వివాహం జరిగి 8 నెలలు అవుతోంది. ఇటీవల జరిగిన బక్రీద్ పండగకు అతడి భార్య ప్రకాశం జిలా గిద్దలూరులోని పుట్టింటికి వెళ్లింది. భార్య దగ్గరకు పండగకు కూడా వెళ్లి వచ్చాడు. వారి మధ్య ఎటువంటి మనస్పర్థలు లేవు. అతడి కుటుంబ సభ్యులతో తరచూ ఫోన్లో మాట్లాడుతుంటాడు. హఠాత్తుగా ఏం జరిగిందో తెలియదు. ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు సాయంత్రం 5.30 గంటల సమయంలో వేరే ఊళ్లలో ఉన్న అతడి అక్కలకు వాట్సాప్‌లో తాను వెళ్లిపోతున్నట్టు మెసేజ్‌లు పెట్టాడు. వారు మెసేజ్ చూసి ఫోన్ చేసేటప్పటికీ ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోంది. దీంతో వారంతా వచ్చి అంతటా వెతికారు. ఫలితం లేకపోవడంతో సర్ఫరాజ్ బావ రహ్మత్ కసీం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్‌రావు కేసు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిపిన వారికి రూ.10 వేలు పారితోషకం చెల్లిస్తామని సర్ఫరాజ్ కుటుంబ సభ్యులు తెలిపినట్టు పోలీసులు చెప్పారు. అతడి ఆచూకీ తెలిసిన వారు కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వామనావతారంలో జగన్నాథుడు

దాబాగార్డెన్స్: టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి వామనావతారంలో శనివారం దర్శనమిచ్చారు. నగరం నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. క్యూలైన్లు బారులు తీరాయి. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకూ నిత్యపూజ, 7 నుంచి 9.30 గంటల వరకూ జగన్నాథస్వామి ప్రార్థనా సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకూ సామూహిక లలితా సహస్రనామ పారాయణ. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. జగన్నాథ స్వామి దేవస్థానం ఫెస్టివల్ ఆఫీసర్, దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహిస్తున్న జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవంలో పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. జగన్నాథ స్వామి ఆదివారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.



వామనావతారంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి

పోలీసుల హెచ్చరికలు బేఖాతర్..!



బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రధాన రహదారిలో ఇష్టానుసారంగా పార్క్ చేసిన వాహనాలు

సీతమ్మధార: ఒకవైపు ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నా.. మరోవైపు దుకాణదారులు, వాహన చోదకుల తీరు మారడం లేదు. బాలయ్యశాస్త్రి లేఅవుట్ ప్రధాన రహదారిలోని దుకాణాల వద్దకు వచ్చిన వారు రోడ్డు మీద ఇష్టానుసారంగా తమ వాహనాలను పార్క్‌చేయడంతో ఇతరుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. కొద్ది రోజులుగా ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించినప్పటికీ వాహనదారులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దుకాణాల యాజమానులు రోడ్డుపై పార్కింగ్ చేయకూడదని వాహనదారులకు చెప్పకపోవడంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. బ్యాంకు ఆఫ్ బరోడా ఎదురుగా నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యానులను రోడ్డుపై నిలిపివేస్తున్నారు. ఈ కూడలిలో యూటర్న్ తీసుకునేందుకు వాహన చోదకులు నిత్యం ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జవాన్ మృతికి నివాళి

సింధియా: ఆర్మ్‌డ్ వర్క్ షాప్‌నకు చెందిన సీఎఫ్ఎన్ ర్యాంకర్ గొట్టపు శంకరరావు అంత్యక్రియలను శనివారం విజయనగరం జిల్లా బాడంగిలో అతని స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణిలో శంకరరావు మృతదేహానికి తూర్పు నావికాదళం స్టేషన్ హెడ్ క్వార్టర్స్ జిల్లా అధికారులు, నగర పోలీసులు నివాళులర్పించారు.



సైనిక లాంఛనాలతో జవాన్ శంకరరావు అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆర్మీ సిబ్బంది, నివాళులర్పిస్తున్న నేవీ సిబ్బంది

